క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన తిరుపతయ్య

వరికుంటపాడు : వరికుంటపాడు నూతన ఎస్సైగా కె.తిరుపతయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న కె.సుమన్ బదిలీపై వీఆర్‌కు వెళ్లారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఓ ఆంజనేయనాయక్

ఉదయగిరి : మండలంలోని 12 ఆర్బీకేల పరిధిలో రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల ఏఓ ఆంజనేయ నాయక్ పేర్కొన్నారు. ఉదయగిరిలోని తన కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. మండలంలో 4,933 మంది రైతులు రైతుభరోసా పథకం ద్వారా రూ.3,69,97,500 లబ్ధిపొందారన్నారు. ఈ-క్రాప్ నమోదు ద్వారా సున్నావడ్డీతో పంట రుణాలు, పంటల బీమా, పంటనష్ట పరిహారం, గిట్టుబాటు ధర తదతర పథకాలు వర్తిస్తాయన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఆత్మకూరు : ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి సర్వీసు, ఆర్థిక, విద్యాసంబంధ సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నేతలు ఎంఈఓ షేక్.నజీర్‌బాషాకు విన్నవించుకున్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో బుధవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

అల్లూరు : వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అల్లూరు-3, 4 సచివాలయ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. ఎంపీపీ శశిరేఖ, నాయకులు నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఉస్మాన్, మేడా రామకృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్, భక్తవత్సల్‌రెడ్డి పాల్గొన్నారు.

తూర్పుదూబగుంటలో వికసిత్ భారత్

కలిగిరి : మండలంలోని తూర్పుదూబగుంట, కృష్ణారెడ్డిపాళెం పంచాయతీల్లో వికసిత్ భారత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు నాభం రేబియా ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నపరెడ్డి వంశీధర్ రెడ్డి, నేతలు భరత్‌కుమార్ యాదవ్, రంగారావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఫిబ్రవరి 10న ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ పరీక్ష కృష్ణాపురం, ఉదయగిరి, దుత్తలూరు, నందిపాడు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 89850 07588, 81068 98817, 94935 14644 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థినులకు అవగాహన

అనుమసముద్రంపేట : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బాలికల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. 18 ఏళ్లలోపు వివాహాలు చేసుకుంటే అనేక సమస్యలు వస్తాయని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తెలుగు ఉపాధ్యాయిని శ్రీవాణి గుడ్ టచ్, బ్యాడ్ గురించి వివరించారు.

హ్యాండ్ వాష్ మెషీన్ ప్రారంభం

కావలి : పట్టణ పరిధిలో హ్యాండ్ వాష్ మెషీన్‌ను బుధవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్థానిక 23వ వార్డు అమృత పార్కులో దీనిని ఏర్పాటు చేశారు.





ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీల్లో క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మధులత, ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా

క్రీడలతో ఉజ్వల భవిత

- ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు : విద్యతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపి ప్రావీణ్యం సాధించాలని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను జేసీ రోణంకి కూర్మనాథ్, ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ కె.మధులతతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటల పోటీలను వివిధ దశల్లో నిర్వహిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో రూ.10 లక్షల సొంత నిధులతో క్రీడా దుస్తులు, బూట్లు, క్రీడా పరికరాలు అందజేయనున్నట్లు, ప్రైజ్‌మనీ సైతం భారీగా ప్రకటించనున్నట్లు తెలిపారు. జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ చూపి స్వగ్రామాలకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తొలుత ఎమ్మెల్యే, జేసీలు జాతీయ జెండాతో పాటు క్రీడా పోటీల జెండాలను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన జీవనసాగర్, తిరుమల, మానసలను ప్రత్యేకంగా అభినందించారు. శాప్ డైరెక్టర్ కాలువ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వేణు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



కావలి : క్రీడాకారులతో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వింజమూరులో క్రీడలను ప్రారంభిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు : ఖోఖో పురుషుల విభాగంలో గెలుపొందిన ఏఎస్‌పేట మండల చిరమన జట్టు

క్రీడా నైపుణ్యాల మెరుగే లక్ష్యం

కావలి : యువతలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మంచి ఫలితాలు సాధించి, రాష్ట్రస్థాయిలో కావలి క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. ఆర్డీఓ వీకే శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వింజమూరు(ఉదయగిరి) : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వింజమూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ యువ నేత మేకపాటి అభినవ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

ఆత్మకూరు : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు తొలిరోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. కబడ్డీకి సంబంధించి పురుష విభాగంలో సంగం మండలం దువ్వూరు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వాలీబాల్‌లో సైతం దువ్వూరు జట్టు గెలిచింది. ఖోఖోలో ఏఎస్‌పేట మండలం చిరమన జట్టు, షటిల్‌లో ఆత్మకూరులోని నెల్లూరుపాళెం జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో కబడ్డీలో సంగం జట్టు, ఖోఖోలో ఆత్మకూరు మండలం బట్టేపాడు జట్టు, షటిల్ పోటీల్లో నెల్లూరుపాళెం జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ తిరుపతయ్య వివరించారు.

రైతులకు న్యాయం చేస్తాం

ఉదయగిరి: సీతారామపురం-దుత్తలూరు మార్గంలో జాతీయ రహదారి-167బిజీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత తెలిపారు. పరిహారం పెంపుపై భూములు కోల్పోతున్న రైతులతో ఆమె బుధవారం మండలంలోని శకునాలపల్లి సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పరిహారం పెంపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. అనంతరం పలువురు రైతులు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన గీతా జ్ఞానయజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో మూడు వారాలుగా జరుగుతున్న భగవద్గీత కంఠస్థ శ్లోకాల పోటీలు బుధవారంతో ముగిశాయి. స్థానిక శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ముగింపు సమావేశానికి నెల్లూరుకు చెందిన ఖాదర్‌బాషా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, బయ్యా శ్రీనివాసులుగుప్త, గార్లపాటి సురేష్ బాబు, అపర్ణ పాల్గొన్నారు.

పొలం విషయమై వివాదం

అల్లూరు : మండలంలోని బట్రకాగొల్లు గ్రామంలో పొలం సంబంధమై జరిగిన వివాదంలో స్థానిక గిరిజనుడైన చేవూరి సురేష్‌కు అదే గ్రామానికి చెందిన మహేష్, సుధాకర్ మధ్య వాగ్వాదం జరిగి దాడులకు పాల్పడ్డారు. ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పొలానికి నీరు పారించుకునే విషయంలో ఇరువురి మధ్య జరిగిన వాగ్వాదంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీనిపై బుధవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ వైద్యం

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. డాక్టర్ అస్మా, కంటి వైద్యుడు సుబ్రహ్మణ్యంతో వైద్యసేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఇళ్లకే వెళ్లి వేలాది రూపాయల వైద్య పరీక్షలను ఉచితంగా చేసి మందులు అందజేస్తున్నారన్నారు.

ఆర్టీసీ బస్సులకు వైద్య కిట్లు

పట్టణంలోని ఎంజీఆర్ బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసేందుకు ప్రథమ చికిత్స కిట్లను అభిరామ్ ఆస్పత్రి నిర్వాహకుల సహకారంతో డీఎం కరీమున్నీసా, డ్రైవర్లు, కండెక్టర్లకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అందజేశారు. ప్రయాణాల్లో ఎవరికైనా అనారోగ్య పరిస్థితులు ఏర్పడితే ఫస్ట్ ఎయిడ్ కిట్‌లలో మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

మహిళల స్వయం ఉపాధికి చేయూత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అన్నారు. మెప్మా సహకారంతో ఎల్ఆర్‌పల్లిలో పొదుపు మహిళ సునీత ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.నాగేశ్వరరావు, మెప్మా ఎంఎం అంకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ మెషీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కౌన్సిలర్లు రమాదేవి, తిరుపతమ్మ, రాధిక, పెంచలయ్య, శివకోటారెడ్డి, రాజశేఖర్, పార్టీ నేతలు ఐవీ రమణారెడ్డి, షేక్ పర్వీన్, మెప్మా సిబ్బంది మాధవి, సుష్మా, సునంద, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌లో సురక్ష సేవల గురించి ఆరాతీస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

జగనన్న పాలనలో అన్నివర్గాలకు మేలు

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి


జలదంకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జలదంకి పంచాయతీలోని నెహ్రూనగర్ కాలనీ, టెంకవారిపాళెం, జలదంకి ఎస్సీ కాలనీల్లో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. స్థానికుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి అప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. జలదంకి-2 పరిధిలోని నెహ్రూనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఎన్నికలు వస్తుండటంతో టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఉదయగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపనపడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తిప్పారెడ్డి ఇందిరమ్మ, రావి ప్రసాద్‌నాయుడు, కోర్సుపాటి రామిరెడ్డి, సూరె వెంకటశేషారెడ్డి, రామాల రమేష్‌రెడ్డి, తమ్మినేని సతీష్‌నాయుడు, సర్పంచ్ అనూరాధ పాల్గొన్నారు.



విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించిన రాజగోపాల్‌రెడ్డి

శనగ పంటలో సస్యరక్షణ చేపట్టాలి

దుత్తలూరు : శనగ పంటకు సంబంధించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు పి.చెన్నారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మందాలపల్లిలో శనగ, వరి పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. అలాగే ఈ-క్రాప్ నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వరిలో అగ్గితెగులు ఉన్నట్లు గుర్తించారు. నత్రజని ఎరువును తగిన మోతాదులో వాడాలన్నారు. లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. శనగలో శనగపచ్చ నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను ఎకరాకు 100 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. మండల ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి, ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏలు తనూజ, కేశవ పాల్గొన్నారు.



శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

పంటకోత ప్రయోగంపై శిక్షణ

మర్రిపాడు : మండలంలోని వీఏఏలకు పంటకోత ప్రయోగంపై శిక్షణా కార్యక్రమాన్ని మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఏఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఏఎస్ఓ విజయ్‌కుమార్, డీఎస్ఓ శ్రీనివాసులు పంటకోత ప్రయోగం గురించి వివరించారు. రబీ సీజన్‌లో పంటకోత ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసేలా అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి

సోమశిల : అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరుగుతోందని, ప్రస్తుతం పెద్దగా సమస్యలు లేవని వివరించారు. అనంతరం పలు శాఖల పనితీరుపై ఎంపీడీఓ మధుసూదన్‌రావు ఆరాతీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, సర్పంచ్ శోభ, కో-ఆప్షన్ సభ్యుడు కరీముద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

సోమశిల : అనంతసాగరంలోని ఎంపీపీ కార్యాలయంలో మెట్టుకూరు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ టీఏ క్యాలెండర్, డైరీని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను ఎంపీపీకి వైఎస్సార్‌సీపీ టీఏ నూతన అధ్యక్షులు నీరుకట్టు శ్రీలత, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున వివరించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ నరసింహులు, వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శోభ, హెచ్‌ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న ఉన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



డ్రైవర్లను అభినందిస్తున్న ఎంవీఐ

ఆత్మకూరురూరల్ : వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు ఉప రవాణాధికారి రాములు పేర్కొన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మేనేజర్ కరీమున్నీసా ఆధ్వర్యంలో డ్రైవర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన బుధవారం హాజరై మాట్లాడారు. ముఖ్యంగా మంచు అధికంగా కురుస్తున్నందున డ్రైవర్లు పరిమిత వేగంతో వాహనాలు నడపాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లకు ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కల్పన, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

విజయీభవ యాత్రకు నీరాజనం

చేజర్ల : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తున్న విజయీభవ యాత్ర కోటితీర్థం గ్రామంలో జన నీరాజనాల మధ్య బుధవారం సాగింది. తొలుత కోటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గంగిరెడ్డి కాలువ బ్రిడ్జిని, తాగునీటి పథకాన్ని, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక శివాలయం అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటికి ఘన స్వాగతం

మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో వందలాది బైక్‌లతో స్వాగతం పలికారు. చేజర్లకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని తిమ్మాయపాళెం బైక్‌లతో బయలుదేరారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపి యువతను ఉత్సాహ పరిచారు. మండల యువ నేత తూమాటి వంశీకృష్ణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి మహమ్మద్ రఫీ, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి పెంచలయ్య, యువజన విభాగం మండలాధ్యక్షుడు ఆంధ్రా వెంకటరెడ్డి పాల్గొన్నారు.



దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జలదంకి ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా సంబరాలను బుధవారం నిర్వహించారు. నాలుగో విడత నమూనా చెక్కును పొదుపు సంఘాల సభ్యులకు ఆయన అందజేశారు. పెద్దఎత్తున పొదుపు మహిళలు హాజరయ్యారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసి చూపించారని తెలిపారు. జలదంకి మండలంలో నాలుగు విడతల్లో 712 డ్వాక్రా సంఘాల్లోని 6,720 మంది మహిళలకు రూ.5.65 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఐకేపీ ఏపీఎం శ్రీధర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, సర్పంచ్ అనూరాధ, వైఎస్సార్‌సీపీ నేతలు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, రావి ప్రసాద్ నాయుడు, తిప్పారెడ్డి ఇందిరమ్మ, గుర్రం జగ్గయ్య, సురె వెంకటశేషారెడ్డి, గుమ్మడి రమేష్, బి.కృష్ణారెడ్డి, టి.సతీష్‌నాయుడు, కె.మహదేవ పాల్గొన్నారు.

సెమినార్‌లతో ఉపయోగం

ఉదయగిరి : కళాశాలల్లో వివిధ విభాగాలకు సంబంధించి నిర్వహించే సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'బయో టెక్నాలజీ ఇన్ హెల్త్‌కేర్ అండ్ అగ్రికల్చర్, ఇన్‌సైట్స్ అండ్ ఇన్నోవేషన్స్' అనే అంశంపై బుధవారం సెమినార్ జరిగింది. ఇందులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సెమినార్లను ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మానవ ఆరోగ్యానికి, వ్యవసాయానికి బయోటెక్నాలజీ చేస్తున్న సేవలను, నూతన మార్పులను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ గోపాలకృష్ణ, వి.కృష్ణకుమార్, అనిల్‌కుమార్, సాయినాథ్‌లు వక్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగేంద్రప్రసాద్, చక్రపాణి, కో-ఆర్డినేటర్ విక్రమ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్